## పరిగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 20 : పరిగి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన మున్సిపాల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పని చేస్తామన్నారు. నీటి వసతులకు రూ.15కోట్లు, వార్డుల్లో సీసీ రోడ్లు, రూ.5 కోట్లతో మున్సిపల్ కార్యాలయం భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం పరిధిని మరింత పెంచుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. తుంకులగడ్డలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, వైస్ చైర్‌పర్సన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న ప్రత్యేక అధికారి హన్మంతరావు

దోమ, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఆరు గ్యారెంటీల అమలు పారదర్శకంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి హన్మంతరావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల అమలుపై ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్ బాబు, తహసీల్దార్ పురుషోత్తం,డీటీ నర్సింహులు, ఎంపీవో సోమలింగం, ఏవో ప్రభాకర్ రావు, ఏపీఎం సురేశ్, ఎస్సై ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నిరసన



నవాబుపేట, జనవరి 20 : డిసెంబర్ 21న జెడ్పీ హెచ్ఎస్ తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ కో చైర్మన్ టీఎస్ యుటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం డిమాండ్ చేశాడు. మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో మండల పరిధిలోని మీనపల్లి కలాన్ పాఠశాల ఉపాధ్యాయులతో నిరసన తెలిపారు. ఇప్పటి వరకు కూడా నిందితులను అరెస్ట్ చేయకపోవడం ఎమిటని ప్రశ్నించారు. ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంఎస్ బాలేశ్వరరావు, ఉపా ధ్యాయులు శ్రీనివాస్‌రావు, గోవిందమ్మ వెంకటయ్య, మాణిక్ ప్రభు, మల్లేశం, రవీందర్ ఉన్నారు.

# రూ. 45కోట్లతో ట్యాంక్‌బండ్ నిర్మాణం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్, జనవరి 20: మున్సిపల్ పాలక మండలి సమావేశం చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈనెల 26వ తేదీతో పాలకమండలి గడువు ముగుస్తుండటంతో చైర్మన్ పాలక మండలి చివరి సమావేశాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్‌కు వచ్చిన రూ.427కోట్లు నిధులకు సంబంధించి పనులపై కొన్నింటికి తీర్మానాలు చేశారు. ఇందులో భాగంగా రూ. 45కోట్లతో కొడంగల్ చెరువు కట్టపై ట్యాంక్‌బండ్ నిర్మాణం, మినీ స్టేడియం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, అంబేద్కర్ కూడలి విస్తరణ వంటి పనులకు ఆమోదం తెలిపారు. పాలక మండలి గడువు ముగిసినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తీర్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌తో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 340 మందికి ఉచితంగా కంటి పరీక్షలు..



తాండూరు రూరల్, జనవరి 20: తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామంలో సోమవారం ఎల్ఎన్ఆర్ ట్రస్టు నిర్వాహకులు లొంక నర్సింహులు ఆధ్వర్యంలో శంకర కంటి వైద్య ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కరణ్‌కోట, బెల్కటూర్, ఓగిపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్ తదితర గ్రామాల నుంచి 340 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ , మాజీ ఎంపీపీ శరణుబసప్ప, ఎంపీటీసీ రాజ్ కుమార్, సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్, జన్నె నాగప్ప ఉన్నారు.

# మానసిక రుగ్మతలకు ఒత్తిడే కారణం



దేవులపల్లి అమర్‌కు అవార్డును అందజేస్తున్న ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోషియేషన్ ప్రతినిధులు, చిత్రంలో అల్లం నారాయణ ఉన్నారు

ఎర్రగడ్డ, జనవరి 20: వివిధ వృత్తులు, ఒత్తిడుల కారణంగా ఎంతో మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో 'మానసిక ఆరోగ్యం గురించి ప్రజలను చైతన్యవంతం చేయటంలో మీడియా పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్థసారథి మాట్లాడుతూ మానసిక వైద్య నిపుణుల సేవలు నగరంతో పాటు జిల్లాల్లో కూడా అందించాలని కోరారు. మానసిక సమస్యలున్న వారిలో 25 శాతం మంది తమ సమస్యలను ఇతరులతో పంచుకుంటున్నారని మిగితా వాళ్లు ఆ బాధలను దిగమింగుతున్నారని అన్నారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్‌లు మాట్లాడుతూ మానసిక సమస్యలతో బాధ పడుతున్నవాళ్లను రోగులుగా చూడకుండా సరైన సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇతర డిజిటల్ మీడియాలు సమాజంలో మానసిక సమస్యలతో బాధ పడుతున్నవారికి చక్కని సలహాలు, సూచనలివ్వటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఎండోమెంట్ ఓరేషన్ అవార్డును దేవులపల్లి అమర్‌కు అందజేసి దేవులపల్లితో పాటు అల్లం నారాయణను శాలువాలతో సన్మానించారు. సెమినార్‌లో ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.కిషన్, కార్యదర్శి రిషికేష్‌గిరిప్రసాద్, శివ అనూప్, సుధీర్‌రావు, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్, మానసిక వైద్య నిపుణులు వి.జార్జిరెడ్డి, విశ్వాసన్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

### హెచ్ఐసీసీలో నాలుగు రోజుల పాటు సదస్సు..

సైక్రియాట్రిక్ సొసైటీ 76వ వార్షిక జాతీయ సదస్సును ఈ నెల 22 నుంచి 25 వరకు హెచ్ఐసీసీలో నిర్వహించనున్నట్లు ఈ సదస్సుకు ఆర్గనైజింగ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ పి.కిషన్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వందలాది మంది మానసిక నిపుణులు ఈ సదస్సుకు హాజరౌతారని వెల్లడించారు. సమాజంలో మానసిక రుగ్మతలను తగ్గించటం ధ్యేయంగా అనుసరించాల్సిన విధానాలు, హాజరైన ప్రతినిధుల సూచనలను పొందుపర్చటమే కాకుండా నిపుణుల విలువైన అభిప్రాయాలను సేకరించటం జరుగుతుందని ఆయన అన్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడొద్దు..

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ఫ్లాట్ ఫామ్, బైక్ ట్యాక్సీ ఫ్లామ్స్ నిర్వాహకులతో సోమవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వేగంగా డెలివరీ చేయాలనే తపనతో గిగ్ వర్కర్లు ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నారని.. వీటితో ప్రమాదాలు జరుగుతున్నాయని జాయింట్ సీపీ తెలిపారు. ఈ సమావేశంలో మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# 11 అంశాల ఎజెండా ఏకగ్రీవ ఆమోదం



కౌన్సిల్ సభ్యులతో చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల

వికారాబాద్, జనవరి 20 : వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశం 11 అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కొత్తగా రూ. 60 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



యాలాల, జనవరి 20: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు మంజూరుకాగా మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో రూ. 85,09,860 విలువ గల చెక్కులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధికారులతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షుడు భీమయ్య, జిల్లా కో ఆప్షన్ మాజీ అధ్యక్షులు అక్బర్ బాబా, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దరఖాస్తుల వెరిఫికేషన్



కులకచర్ల, జనవరి 20 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న దరఖాస్తుదారుల పరిశీలన కార్యక్రమాన్ని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర పరిశీలించారు. కార్డుల పరిశీలన సక్రమంగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, గ్రామ పెద్దలు చంద్రభూపాల్‌రావు, షరీఫుద్దీన్, భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సంతోశ్, గ్రామస్తులు చెన్నయ్య, రమేశ్, బాల్‌రాజ్, అంజి పాల్గొన్నారు.

## విజేత జట్లకు బహుమతులు అందజేత



కులకచర్ల, జనవరి 20: మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో శ్రీరంగంబాయ్ బాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డిల స్మారకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి 4 సీజన్ టోర్నమెంటులో గండీడ్ మండలం నంచర్ల గ్రామ జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకున్నది. మొత్తం 40 జట్లు పాల్గొనగా బండవెల్కిచర్ల జట్టు ద్వితీయ బహుమతి పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

# చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తాం..

### హైడ్రా కమిషనర్ రంగనాథ్




బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్


సిటీబ్యూరో, జనవరి 20(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌తో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ నిర్ధారణ పూర్తయితే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 89 ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే క్షుణ్ణంగా పరిశీలించి గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్‌సీ ఇమేజీలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి వాస్తవాలేంటంటూ చర్చించారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి.. హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనే అంశాలపై గూగుల్ మ్యాప్స్, ఎన్ఆర్ఎస్‌సీ ఇమేజిలను పరిశీలించి హైడ్రా తర్వాత పర్మిషన్ లేకుండా వెలసిన నిర్మాణాలను కూల్చేస్తామని రంగనాథ్ తెలిపారు. అమీన్‌పూర్‌లో 193 సర్వే నెంబర్‌లోని తమ స్థలాన్ని వైసీపీ మాజీ ఎమ్మెల్యే మరో వ్యక్తితో కలిసి కబ్జా చేశారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలు, గూగుల్ మ్యాప్స్‌తో సహా అన్ని టెక్నికల్ ఎవిడెన్స్ హైడ్రా కమిషనర్‌కు అందజేశారు. చెరువు ఔట్‌ఫ్లో బయటకు పోకుండా మొత్తం మట్టిపోసి ఎత్తు పెంచారని, దీనివల్ల చెరువు పెద్దగా విస్తరించి రైతులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ అమీన్‌పూర్ చెరువు, అక్కడి ప్రభుత్వ స్థలాల చుట్టూ అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయి సర్వే చేయిస్తామన్నారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటి పరిధిలోనే మేడికుంట చెరువు 45ఎకరాల పరిధిలో ఉండగా క్రమేణా కబ్జాలు జరిగి చెరువు కుంచించుకుపోయిందని, చెరువుకు హద్దులు నిర్ధారించి ప్రజావసరాలకు బఫర్‌జోన్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మల్కాజిగిరిలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

మూసాపేటలోని ఆంజనేయనగర్‌రోడ్డు నంబర్ 9లో 2వేల గజాల పార్క్ స్థలం కబ్జాకు గురవుతున్నదని అడ్డుకున్న తమపై దాడికి దిగుతున్నారని స్థానికంగా నివాసముంటున్న దంపతులు ఫిర్యాదు చేశారు. ఈ పార్కును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.50లక్షలు విడుదల చేసిందని, ఈ మేరకు శిలాఫలకం కూడా వేశారన్నారు. ప్రహరీ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తుంటే కబ్జాదారులు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులలో ప్రధానంగా చెరువులు, కుంటలకు సంబంధించి సాంకేతికంగా హద్దుల నిర్ధారణ జరుగుతున్నదని త్వరలోనే ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లను ఫైనల్ చేసి కబ్జాలకు చెక్ పెడుతామని రంగనాథ్ ఫిర్యాదుదారులకు చెప్పారు. ప్రభుత్వస్థలాల ఆక్రమణలపై ఫిర్యాదుదారులు ఇచ్చిన ఆధారాలను పరిశీలించి మూడువారాల్లో పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు.

# సాయం చేసినట్లు నటిస్తారు.. అమాయకులను ముంచేస్తారు

### ఏటీఎం కార్డులు తస్కరించే ముఠా అరెస్ట్

### రూ.7.50 లక్షల నగదు స్వాధీనం




నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ స్నేహమిశ్ర, ఇతర పోలీస్ సిబ్బంది

చార్మినార్, జనవరి 20: సహాయం చేస్తున్నట్లు నమ్మిస్తారు. ఏటీఎంల వద్దకు వచ్చే అమాయకులను టార్గెట్ చేస్తారు. వారికి తెలియకుండానే ఏటీఎం కార్డులు తస్కరించి నగదు కాజేసే ముఠాను దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దక్షిణ మండల డీసీపీ స్నేహమిశ్ర వివరాల ప్రకారం హర్యానాకు చెందిన వకీల్ అలీ (45) నగరానికి వలస వచ్చి చార్మినార్ పరిసర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి హర్యానాకే చెందిన ఇస్లాంతో పాటు యూపీకి చెందిన గుల్లూ ఫర్మాన్ (23), హైదరాబాద్‌కు చెందిన ఒబైద్ ఆరీఫ్ (30)తో పరిచయం ఏర్పడింది. విలాస జీవితానికి అలవాటు పడిన వీరంతా ఓ పథకం రచించారు. ఉదయం, సాయంత్రం ఏటీఎం కేంద్రాలకు వచ్చే వారి దృష్టి మరల్చి వారి వద్ద నుంచి నగదు తస్కరించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నగదు తీసుకునేందుకు వచ్చే వారికి సహాయం చేస్తున్నట్లు నటించేవారు. అమాయకులను మాటల్లో పెట్టి ఏటీఎం కార్డు, పిన్ నంబర్లను సేకరించేవారు. వీటి ఆధారంగా మరో ప్రాంతానికి వెళ్లి నగదు డ్రా చేసుకొని వాటాలు పంచుకునేవారు. గత నెల బహదూర్‌పురకు చెందిన అతియా ఖాన్ ఏటీఎంకు రాగా ఆమెను నమ్మించిన ముఠా సభ్యులు చాకచక్యంగా ఏటీఎం కార్డును తస్కరించారు. పిన్ నంబర్ తెలుసుకొని నకిలీ కార్డును ఆమె చేతిలో పెట్టి అక్కడ నుంచి పారిపోయారు. అతియా ఖాన్ నుంచి తస్కరించిన కార్డు ద్వారా దశలవారీగా రూ.2 లక్షల మూడు వేల నగదును డ్రా చేయగా ఆమె బహదూర్ పుర పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. అనుమానితులైన వకిల్ అలీ, ఫర్మాన్, ఒబైద్‌అలీని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి విచారించారని డీసీపీ సేహ మిశ్ర తెలిపారు. మరో ఇద్దరు నిందితులైన గుల్లూ, ఇస్లాం పరారీలో ఉన్నారని వెల్లడించారు. వీరిపై తెలంగాణలో 10 కేసులు, ఆంధ్రప్రదేశ్‌లో 2, ఒడిస్సాలో 4, కర్నాటకలో 2 కేసులు నమోదైనట్లు డీసీపీ స్నేహమిశ్ర తెలిపారు. నిందితుల నుంచి రూ.7.50లక్షలు, వివిధ బ్యాంకులకు చెందిన 105 కార్డులు, ద్విచక్ర వాహనం, కారు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్, ఫలక్‌నుమా డివిజన్ ఏసీపీ జావెద్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంగ్లిషు మీడియం సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జనవరి 20: తెలంగాణ సాం ఘిక సంక్షేమ లలిత పాఠశాల, మల్కా జిగిరి, మేడ్చల్ జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంగ్లిషు మీడి యం సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లుటీజీఎస్ డబ్ల్యూఆర్ఎఫ్ఏఎస్ పాఠశాల హెచ్ఎం రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తర గతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకు లాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో ప్రవేశం కోసం టీజీఎస్ డబ్ల్యూర్ గౌలిదొడ్డి, అలుగునూరు సీఈ వోలో 9వ తరగతి ప్రవే శాల కోసం టీజీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్‌వోఈలో 8వతర గతిలో ప్రవే శాలకు, టీజీఎస్‌డబ్ల్యూ ఆర్ ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కా జిగిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగ తిలో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రెన్స్ పరీక్ష కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నా మని తెలిపారు. విద్యార్థి, విద్యార్థినులు https// tgcet. cgg.gov.in ఈ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకు నేందుకు చివరి తేదీ ఫిబ్రవరి ఒకటి అని చెప్పారు. పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిబట్ల, జనవరి 20 : మంగల్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్న దని ఏఈ జయ న్న తెలిపారు. మంగ ల్‌పల్లి, సాహెబ్ గూడ, చింతపల్లిగూడ, కొంగరకలాన్, బొంగుళూరు, మలిశెట్టి గూడ, రాందాస్‌పల్లి, ఎంపీపటేల్ గూడ, సీవీఆర్ కళాశాల పరిసర ప్రాం తాల్లో ఉదయం 10 నుంచి మధ్యా హ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫ రాను నిలిపివే స్తున్నామన్నారు .


## మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



దుద్యాల మండలంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కొడంగల్, జనవరి 20: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం గ్రామగ్రామాన కేక్ కట్ చేసి సంబురాన్ని జరుపుకున్నారు. అదే విధంగా హైదరాబాద్‌కు తరలి వెళ్లి ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలను అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



కులకచర్ల, జనవరి 20 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా ఉపయోగపడుతుందని కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడ్, జె వెంకటయ్యగౌడ్, గోపాల్‌నాయక్, విఠల్‌నాయక్, అంజిలయ్యగౌడ్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.